క్లుప్తంగా

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళం, పసుపు, కుంకుమ, విభూది తదితరాలతో అభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

ఘనంగా హిందీ దివస్

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీరామనగర్ కాలనీలో వున్న శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం ఘనంగా హిందీ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. హిందీ భాష గొప్పతనాన్ని తెలిపేలా అనేకరకాల వ్యాకరణాంశాలు, గేయాలు, కవితలు, పద్యాలను చదివి వినిపించి వాటి అర్థాలను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ రూపాదేవి మాట్లాడుతూ హిందీని అందరూ నేర్చుకోవాలన్నారు. ఏజీఎం సురేష్, డీన్ త్రివేణి, ఇన్‌చార్జిలు కల్పన, శ్రీహరి, వంశీ, ఉపాధ్యాయులు షేక్ అహ్మద్ తాజ్, భువనేశ్వరి, మంజు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ




విద్యార్థులతో స్కూల్ మేళా నిర్వాహకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు, ఓబులాయపల్లి, అక్కుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన 60 మంది మెరిట్ విద్యార్థులకు సోమవారం స్కూల్ మేళా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ముచ్చివోలు ఇన్‌చార్జి హెచ్ఎం శర్మ మాట్లాడుతూ స్కూల్ మేళా సంస్థ పదేళ్లుగా మెరిట్ విద్యార్థులను గుర్తించి విద్యాసామగ్రి అందజేస్తోందన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో ప్రియదర్శిని, చందన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగలో పెళ్లకూరు చాగణం లలితమ్మ, భాస్కర్ రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్టు ట్రస్టు ఎండీ చాగణం గౌరీశంకర్, సీఈఓ సీతారామ్‌నాయుడు తెలిపారు. ప్రతి బ్యాచ్‌కు 35 మంది మహిళలకు టైలరింగ్‌లో కటింగ్, కుట్టడంపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు ఏఓ కృష్ణ గల్లా, శిక్షకురాలు భారతి తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అక్టోబర్ 4న అన్నదానం సత్రం ప్రారంభం



ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు

శ్రీకాళహస్తి: తిరుపతి నగరంలోని బొమ్మల దుర్గాప్రసాద్ దుర్గ శశికళ ప్రాంగణంలోని అంకాల పరమేశ్వరి ఆలయం పక్కన ఏర్పాటుచేసిన శ్రీనివాస ఉమా రామలింగేశ్వర అన్నదాన సత్రాన్ని అక్టోబరు 4న ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వారు సోమవారం ఆహ్వాన పత్రికలు విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం యువజన విభాగం అధ్యక్షుడు పులి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి మండలస్థాయి క్రీడా పోటీలు

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెంలో ఈ నెల 17 నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓలు సరస్వతి, గున్నయ్య, క్రీడాపోటీల మండల కో-ఆర్డినేటర్ పీడీ బందిల కుమార్ సంయుక్తంగా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరదయ్యపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, చెస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ క్రీడలు జరగనున్నట్లు వారు వివరించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు అండర్-14, అండర్- 17 బాలబాలికలు మాత్రమే అర్హులుగా వారు ప్రకటించారు. ఇందుకు సంబంధించి మండల కో-ఆర్డినేటర్ పూర్తిస్థాయి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. క్రీడాపోటీల విజయవంతానికి అన్ని స్కూళ్ల ఉపాధ్యాయులు, హెచ్ఎం, పీడీలు సహకరించాలని ఎంఈఓ కోరారు.

లోపించిన పారిశుద్ధ్యం





- దుర్గంధంతో ముక్కులు మూసుకోవాల్సిందే
- విజృంభిస్తున్న దోమలు
- ప్రబలుతున్న జ్వరాలు



12, 14వ వార్డుల్లో కాలువల దుస్థితి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో పారిశుద్ధ్యం లోపించింది. కాలువల్లో మురుగు ముందుకు కదలడం లేదు. దుర్గంధం వెదజల్లుతుండడంతో ముక్కులు మూసుకోవాల్సి వస్తోందని, దోమలు విజృంభించడంతో జ్వరాలు ప్రబలుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అప్పుడప్పుడు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాలువలను శుభ్రం చేయాలని కోరుతున్నారు. గతంలో మున్సిపల్ కార్మికులు ప్రతి ఇంటికీ వెళ్లి చెత్తను సేకరించేవారు. ఇప్పుడు అధికారుల పర్యవేక్షణ కరువవడంతో చెత్తను సేకరించడం లేదు. ముఖ్యంగా మిట్టకండ్రిగ, నక్క హరిజనవాడ, రాజీవ్‌నగర్ వార్డుల్లో ఎక్కడ చూసినా చెత్త దర్శనమిస్తోంది. అలాగే 14, 12వ వార్డుల్లోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు నీరు ముందుకు కదలడం లేదు. 15వ వార్డులో వున్న పెద్ద కాలువలోకి కొంతమంది లెట్రిన్ పైపులు మళ్లించారు. దీంతో దుర్గంధం వెదజల్లుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కాలువలను శుభ్రం చేయడంతోపాటు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన ఎంపీపీ



బియ్యపు మధుసూదన్‌రెడ్డిని కలిసిన ఏర్పేడు ఎంపీపీ జమళ్ల శ్రీనివాసులు

ఏర్పేడు: ఏర్పేడు ఎంపీపీ జమ్మళ్ల శ్రీనివాస్ యాదవ్ సోమవారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మండల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన ఎంపీపీకి సూచించారు. కార్యక్రమంలో ఐతేపల్లి గురునాథం, కేశవరెడ్డి, ధనుష్, జ్ఞాన ప్రకాష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మోటార్ స్టార్టర్ల చోరీ

ఏర్పేడు: మండలంలోని ముసలిపేడు సమీపంలో రైతుల పొలాల్లో ఉన్న విద్యుత్ మోటార్లకు ఏర్పాటుచేసిన స్టార్టర్లను ఆదివారం రాత్రి దొంగలు చోరీ చేశారు. అదేవిధంగా ట్రాన్స్‌ఫార్మర్ బోల్టులు విప్పి రాగి వైరు చోరీ చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడే వదిలేశారు. సుమారు పది మంది రైతుల మోటారు స్టార్టర్లను చోరీ చేశారు. బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పంట కాలువ ఆక్రమణపై ఫిర్యాదు



తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పెద్దపాలేడు గ్రామ పొలాల్లోని పంటలకు చెరువులోని నీటిని అందించే పంటకాలువను కొందరు ఆక్రమించుకున్నారని సోమవారం సుగ్గుపల్లికి చెందిన రైతులు తహసీల్దారు శ్రీదేవికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట కాలువ ద్వారా 100 ఎకరాల్లోని పంటలకు చెరువుల నుంచి నీరు అందుతుందన్నారు. అయితే ఈ కాలువను పెద్దపాలేడు గ్రామానికి చెందిన ఓ రైతు ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేశాడని, దీంతో పంటలకు నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము సాగు చేసిన పంటలకు నీరు అందక దెబ్బతింటున్నాయని వాపోయారు. పలుమార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని, ఆక్రమణను తొలగించకపోతే జిలా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దారు శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన తహసీల్దారు మాట్లాడుతూ సర్వే చేయించి, పంట కాలువ ఆక్రమణను తొలగిస్తామని హామీ ఇచ్చారు.

పీజీఆర్ఎస్‌కు మండలస్థాయి అధికారుల గైర్హాజరు



ఖాళీగా ఉన్న ఎంపీడీఓ కుర్చీ

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహిస్తారు. ఇందులో మండల, గ్రామ స్థాయి అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, పరిష్కరించాలి. అయితే సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ఈ పీజీఆర్ఎస్‌కు ఎంపీడీఓతో సహా మిగిలిన మండల, గ్రామస్థాయి అధికారులు హాజరు కాలేదు. దీంతో వారి కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేసే మండల స్థాయి అధికారులైన ఈఓపీఆర్డీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కూడా విధులకు హాజరుకాకపోవడంతో వినతులు ఇవ్వడానికి వచ్చిన ప్రజలు, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. మండల స్థాయి అధికారులే విధులకు డుమ్మా కొడితే కిందిస్థాయి ఉద్యోగుల పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలని ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విధులకు సక్రమంగా హాజరయ్యేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



పెంచులయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

తొట్టంబేడు: మండలంలోని ఇలగనూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పాచి పెంచులయ్య సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు, నాయకులు వెంకటయ్య, సుబ్రహ్మణ్యంనాయుడు, సుబ్రహ్మణ్యంయాదవ్, పాచి కాలయ్య, పెంచులయ్య, మణి, బుల్లెట్ జయశ్యామ్, పసల సురేష్, నక్క రమణ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఓల పనితీరుపై ఆగ్రహం



మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీదేవి

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామ రెవెన్యూ అధికారుల పనితీరు బాగోలేదని, పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని తహసీల్దారు శ్రీదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె సోమవారం కార్యాలయంలో వీఆర్ఓలు, సర్వేయర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కర వేదిక గ్రీవెన్స్‌లో వచ్చిన వినతులను విచారించి పరిష్కకరించడంతో వీఆర్ఓలు విఫలమయ్యారని, పలు దఫాలు హెచ్చరించిన పట్టించుకోవడం లేదన్నారు. పనితీరు మార్చుకోకపోతే కలెక్టర్ కార్యాలయానికి సరండర్ చేస్తానని హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. భూసమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే ఊరుకోనన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయరు ప్రకాష్, వీఆర్ఓలు, పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన



ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న స్టెప్స్ ప్రాజెక్టు ప్రతినిధులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి సబ్‌జైలులో వున్న ఖైదీలకు సోమవారం స్టెప్స్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఎయిడ్స్, హైపటైసిస్‌పై అవగాహన కల్పించారు. ప్రాజెక్టు మేనేజరు భాస్కర్ మాట్లాడుతూ ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పవన్, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈపోస్ యంత్రాల పంపిణీ

సత్యవేడు: సత్యవేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడుకండ్రిగ మండలాల్లోని రేషన్ డీలర్లకు కొత్త ఈపాస్ (ఎలక్ట్రానిక్ ప్రజా పంపిణీ వ్యవస్థ) యంత్రాలను సత్యవేడు రెవెన్యూ అధికారులు పంపిణీ చేశారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో డీటీ వెంకటేశ్వరన్ ఆధ్వర్యంలో డీలర్లకు మొత్తం 126 యంత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ రేషన్ డీలర్లకు కొత్త ఈపోస్ యంత్రాలు అందజేసినట్లు తెలిపారు. సత్యవేడుకు 55, వరదయ్యపాళెంకు 43, బుచ్చినాయుడుకండ్రిగకు 28 మంది డీలర్లకు ఈపోస్ యంత్రాలు అందజేశామన్నారు. వీటి ధర రూ.35 వేలు అన్నారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం అధ్యక్షుడు సునీల్ జైన్, పలువురు డీలర్లు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

రేణిగుంట: రేణిగుంట బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్, గురుకుల పాఠశాలల విద్యార్థులు దాదాపు 300 మంది పాల్గొన్నారు. అండర్- 14, 17 బాలురు, బాలికల వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఎంఈవో రంగనాథ్, బాయ్స్ హైస్కూల్ హెచ్ఎం అల్లాబక్ష్ పోటీలను ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ప్రభాకర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో యాగయ్య, శ్రీధర్, సత్యనారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మండల కన్వీనర్‌గా సెల్వరాజు

రేణిగుంట: సీఐటీయూ మండల కన్వీనర్‌గా సెల్వరాజు ఎన్నికయ్యారు. రేణిగుంట జీఎం వీధిలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో సోమవారం సీఐటీయూ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాల సుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి జయచంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీ, బిల్డింగ్ విభాగం జిల్లా కార్యదర్శి మునిరాజా ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వెంకటరమణ, ఎంపీటీసీ రాజేశ్వరి, సత్య శ్రీ,భారతి, సులోచన తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం ఎంపీడీఓగా విజయమ్మ



వరదయ్యపాళెం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా విజయమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించింది. ఆమె పెళ్లకూరు మండలంలో ఈఓపీఆర్డీగా బాధ్యతలు నిర్వర్తిస్తూ పదోన్నతిపై మండలానికి రావడం జరిగింది. ఇక్కడ ఏఓగా ఉంటూ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఉన్న ప్రసాద్ యథావిధిగా ఆయన పోస్టు ఏఓగా కొనసాగుతున్నాడు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించండి

తొట్టంబేడు: రైతులు సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన సోమవారం శ్రీకాళహస్తి మండలంలోని పలువురు రైతులను కలిసి పంటల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు సాగుచేసిన వరి పంటకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి, పట్టణ యువజన అధ్యక్షుడు ఆంటోనీ, శ్రీకాళహస్తి మండలం యువజన అధ్యక్షుడు నవీన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ 2వ వైద్యాధికారిగా జగదీష్ నాయక్



నూతన వైద్యాధికారికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న ఆసుపత్రి సిబ్బంది

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రెండవ వైద్యాధికారిగా జగదీష్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ పనిచేస్తున్న వైద్యాధికారి ఉదయ్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి బదిలీపై వచ్చిన జగదీష్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. అలాగే వైద్యాధికారి ద్వైతకు పాలనాధికారి (డీడీఓ)గా ప్రభుత్వం బాధ్యతలు అప్పజెప్పడంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు. వీరిని సోమవారం ఆస్పత్రి సిబ్బంది శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కృష్ణంరాజు, యూడీసీ లీలావతి, పీహెచ్ఎన్ శాంతి, స్టాఫ్ నర్సులు అంజమ్మ, లీలారాణిలు ఉన్నారు.



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఉపాధ్యాయుల నిరసన

శ్రీకాళహస్తి: పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, 12వ పీఆర్సీ కమిషన్ నియమించి 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలనీ ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు కే వెంకటాద్రి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు భారంగా మారిన స్టూడెంట్ అసెస్మెంట్లు, యాప్‌ల నిర్వహణ బాధ్యతలను తప్పించాలనఅనరు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి, తొట్టంబేడు, కేవీబీ.పురం బీఎన్‌కండ్రిగ, పెళ్లకూరు అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్, రామదాసు, ఉదయ్ కుమార్, చెంచురాజు, సురేంద్రబాబు, శివ, సుబ్రహ్మణ్యం రెడ్డి, పెరుమాళ్ల, భువనేశ్వరి, గురవమ్మ, లక్ష్మి, భారతి తదితరులు పాల్గొన్నారు.

దసరాకు డీఏ ప్రకటించాలి



మాట్లాడుతున్న ఏపీ ఎన్‌జీఓ జిల్లా అడ్‌హక్ కమిటీ చైర్మన్ సురేష్‌బాబు

సత్యవేడు: ఏపీఎన్‌జీఓ ఉద్యోగులకు దసరా పండుగకు డీఏ ప్రకటించాలని ఏపీ ఎన్‌జీఓ జిల్లా అడ్‌హక్ కమిటీ చైర్మన్ సురేష్‌బాబు కోరారు. సోమవారం సత్యవేడు ఎన్‌జీఓ భవనంలో అధ్యక్షుడు ఆధ్వర్యంలో సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎన్‌జీఓ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పైన అవుతున్నా ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదని, ఇప్పటికైనా సానుకూలంగా స్పందించి పరిష్కరించాలన్నారు. వచ్చే నెలలో నూతన కార్యవర్గం ఏర్పాటు చేస్తామన తెలిపారు. సమావేశంలో జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ రఘు, ట్రెజరర్ లతిత్‌కుమార్, సభ్యులు శ్యామ్యూల్, ఓంప్రసాద్, ముత్యాలయ్య, వినోద్, కాంచన, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నమాచార్యలో ఇంజినీర్స్ డే





మాట్లాడుతున్న బి.హరి ప్రసాద్, విద్యార్థులు రూపొందించిన నమూనాలు ప్రాజెక్టులు

రేణిగుంట: తిరుపతి – కరకంబాడి రోడ్డులో వున్న అన్నమాచార్య ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం ఇంజినీర్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ నాదమునిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రిటైర్డ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.హరిప్రసాద్, రిటైర్డ్ ఎస్ఈ ఎం.శంకర్ నారాయణ పాల్గొన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు రూపొందించిన నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

అధికారుల నిర్లక్ష్యం.. అన్నదాతలకు శాపం

- రెండేళ్లుగా పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు
- వ్యవసాయ విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం
- పట్టించుకోవడం లేదని రైతన్నల ఫిర్యాదు



బత్తలవల్లం పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

వరదయ్యపాళెం: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి రైతులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని బత్తలవల్లంలో రెండేళ్ల కిందట వ్యవసాయ మోటార్లకు సరఫరా అయ్యే విద్యుత్ వైర్లు చోరీకి గురయ్యాయి. ఆ ప్రాంతంలో నూతనంగా వైర్లను ఏర్పాటు చేయమని స్థానిక రైతులు మండల విద్యుత్‌శాఖ ఏఈకి ఎన్నోమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. ఈ మేరకు రైతులు సోమవారం పంచాయతీ కార్యదర్శి యూసఫ్ ఖాన్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సమస్య గురించి జిల్లా కలెక్టర్‌కు తెలియపరచి తక్షణమే వ్యవసాయ సరఫరాకు విద్యుత్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఈ సమస్య కారణంగా 10 మంది రైతులు రెండేళ్లుగా పంటలు సాగు చేసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య విన్న పంచాయతీ కార్యదర్శి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఆ మేరకు ఫిర్యాదు చేసిన వారిలో రైతులు ఓడూరు ఉజ్వల్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, పాపయ్య, శ్రీనివాసులు, సెల్వరాజ్, చల్లయ్య, రమణయ్య ఉన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: తిరుపతిలో జరిగిన జాతీయ మహిళా సాధికారత సదస్సుకు విచ్చేసిన రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ దంపతులు, రాజ్యసభ సభ్యురాలు సుధా నారాయణ, పలువురు మహిళా ఎంపీలు, ప్రజాప్రతినిధులు సోమవారం శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. వారికి ఆలయ దక్షిణ గోపురం వద్ద ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు, ఈవో బాపిరెడ్డి, బొజ్జల బృందమ్మ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పుత్తూరులో చోరీ



పుత్తూరు: స్థానిక ఆచారి వీధిలో తాళం వేసి ఉన్న ఇంటిలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. బాధితుల కథనం మేరకు వెంకటప్రసాద్, మమత దంపతులు గత శనివారం ఇంటికి తాళం వేసి తిరుమలకు బయలుదేరి వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి చోరీ జరిగినట్లు గుర్తించారు. దుండగులు ఇంటి ప్రధాన ద్వారానికి వేసిన తాళాన్ని రాడ్డు సాయంతో తొలగించి లోనికి చొరబడి బీరువాలోని 30 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.10 వేలు నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.